క్లుప్తంగా

వేణుగోపాలస్వామికి పూజలు



ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి

పెదపూడి: వేండ్ర గ్రామంలో కొలువైన రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామికి సోమవారం పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆషాఢ బహుళ ఏకాదశి సందర్భంగా అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, తర్పణం హోమం చేశారు. ఆలయ అర్చకుడు సత్య కృష్ణమాచార్యులు, వేద పండితుడు హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పారిశుధ్యాన్ని మరింత మెరుగుపర్చాలి



పైన గ్రామంలో పర్యటిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి

పెదపూడి: గ్రామాల్లో పారిశుధ్యాన్ని మరింత మెరుగుపర్చాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. పైన గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను సోమవారం ఉదయం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా క్లాప్ మిత్రాలు ఏ విధంగా తడి, పొడి చెత్త సేకరిస్తున్నారో గమనించారు. స్థానిక వీరభద్రస్వామి ఆలయం వద్ద అన్నదానం నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆయన వెళ్లి అక్కడి వారితో మాట్లాడారు. తడి, పొడి చెత్తను డస్ట్‌బిన్‌లో వేసి, దాన్ని క్లాప్ మిత్రాలకు అందజేయాలని సూచించారు.

నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న దాతలు

బిక్కవోలు: కాపవరం గ్రామంలోని ఒకటో నంబర్ పాఠశాలలో విద్యార్థులకు సోమవారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కొమరపు ప్రసాద్ బాబు సమకూర్చిన ఈ పుస్తకాలను ఆయన కుమారుడు బాలు విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.శ్రీనివాస్, ఎస్.ప్రశాంతి పాల్గొన్నారు.

అనపర్తి ఏరియా ఆస్పత్రి తనిఖీలు




అనపర్తి ఆస్పత్రిని పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మ

అనపర్తి: జిల్లా వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల సమన్వయకర్త (డీసీహెచ్ఎస్) డాక్టర్ పద్మ సోమవారం అనపర్తి ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలు, రికార్డులను పరిశీలించారు. అలాగే నిర్మాణంలో ఉన్న వంద పడగల ఆస్పత్రి భవనాన్ని పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులపై పలు సూచనలు చేసినట్టు సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి అన్నారు. ఆమె వెంట సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ పద్మశ్రీ, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ తరుణ్, నర్సింగ్ సూపరింటెండెంట్ కరుణ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్‌కు అంతరాయం

రాజానగరం: కొండగుంటూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్లపై వార్షిక మరమ్మతుల నేపథ్యంలో బుధవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ విషయాన్ని ఏపీఈపీడీసీఎల్ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నటరాజన్ తెలిపారు. ఆ సమయంలో కొండగుంటూరు, నామవరం, చైతన్యనగర్‌లోని అన్ని రకాల సర్వీసులకు విద్యుత్ ఉండదన్నారు.

శాకంబరిగా రాజరాజేశ్వరీదేవి



రాజానగరం: స్థానిక రాజలింగేశ్వర స్వామి, రాజగోపాలస్వామి వార్ల ఆలయ ప్రాంగణంలో కొలువైన రాజరాజేశ్వరిదేవికి భక్తులు సోమవారం ఆషాఢ మాసం సారెను సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కూరాకుల నరసింహమూర్తి దంపతులు అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు. అనంతరం శివ సేవాసమితి ఆధ్వర్యంలో అన్నసమారాధన చేశారు.

మెట్టలో సాగునీటి కష్టాలు

- ఎండిపోతున్న ఆకుమడులు
- బీటలు తీస్తున్న వరి పొలాలు
- ఎత్తిపోతల పథకాల ద్వారా విడుదల కాని నీరు
- చెరువుల్లో మట్టి తవ్వకాల కోసమేనంటూ విమర్శలు



రంగంపేట మండలంలో నీరు లేక ఎండిపోయిన వరిచేను

రాజానగరం/రంగంపేట: జిల్లాలోని మెట్ట ప్రాంతంలో ఖరీఫ్ వరి సాగుకు అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. సాగునీటి సదుపాయం అంతంత మాత్రంగా ఉండే రాజానగరం, కోరుకొండ, రంగంపేట మండలాలలో ఈ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. అడపాదడపా కురుస్తున్న వర్షాల సాయంతో నార్లు వేసిన రైతులు వాటికి పూర్తి స్థాయిలో నీరందించే పరిస్థితులు లేకపోవడంతో, అవి ఎండిపోతుంటే ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇక నాట్లు వేసిన పొలాల పరిస్థితి గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వరుణుడు కరుణించడు, పాలకులు దయ చూపరు అనే రీతిలో మెట్ట ప్రాంతంలో అన్నదాతలు సాగు నీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం వాతావరణం మండు వేసవిని తలపిస్తోంది. ఇదే సమయంలో భూగర్భ జలాలు కూడా పడిపోవడంతో ఖరీఫ్ పంట సాగు లేక, అయోమయ స్థితిని కర్షకులు ఎదుర్కొంటున్నారు.

సాగునీటి విడుదల ఎప్పుడు?

ఖరీఫ్ సీజన్‌లో ఈ ప్రాంతంలో సుమారు 27,585 హెక్టార్లలో వరి పంటను సాగుచేస్తుంటారు. వీటిలో గొట్టపు బావుల ద్వారా 12,650 హెక్టార్లలో సాగు జరుగుతుంది. మిగిలిన ప్రాంతమంతా వరుణుడి కటాక్షం పైనే ఆధారపడాలి. దీనిని దృష్టిలో గత ప్రభుత్వాలు చాగల్నాడు, వెంకటనగరం వంటి ఎత్తిపోతల పథకాలను ప్రారంభించాయి. గత ప్రభుత్వంలో ఈ పథకాల ద్వారా జూలై మొదటి వారంలోనే సాగు నీటిని విడుదల చేసేవారు. అయితే ప్రస్తుత కూటమి పాలనలో ఆగస్టు సమీపిస్తున్నా ఇంత వరకు ఈ పథకాల ద్వారా చుక్క నీరు కూడా విడుదల చేయలేదు. ఇదే తరుణంలో వరుణుడు కూడా చుట్టపు చూపుగా అప్పుడప్పుడు పలకరించి పోతున్న తరుణంలో సాగు చేసిన పంటలు బీటలు తీస్తున్నాయి. మెట్టలో జూన్‌లో కురిసిన వర్షాలకు రైతులు నారుమడులు పోసి నాట్లు వేశారు. మరి కొందరు వెదజల్లారు.



వడిశలేరులో సాగునీరు లేక ఎండిపోయిన నారుమడి



ట్యాంకులతో పొలాలను తడుపుకొంటున్న రైతులు

సాగునీరివ్వని ఎత్తిపోతల పథకాలు

చాగల్నాడు ఎత్తిపోతల పథకం ద్వారా సుమారు 28,500 ఎకరాలకు, వెంకటనగరం ఎత్తిపోతల పథకం ద్వారా సుమారు 15,200 వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. కానీ ఈ పథకాల నుంచి ఇంతవరకు నీరు విడుదల చేయకపోవడంతో ఆయకట్టులోని రైతాంగం సాగునీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు. నీరు లేక ఎండలకు ఎండిపోతున్న నారుమడులను, వేసిన వరి నాట్లను చూస్తూ ఉండలేక దూర ప్రాంతాల నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకువచ్చి ఆయా పొలాలను తడుపుతున్నారు. గతంలో ఎన్నడూ ఇటువంటి పరిస్థితులు ఏర్పడ లేదని, మొదటిసారిగా ఈ దుస్థితి ఎదురైందని వాపోతున్నారు.

చెరువుల్లో మట్టి తవ్వకాల కోసం..

రాజానగరం నియోజకవర్గంలోని పలు చెరువులలో మట్టి తవ్వకాలు జోరుగా జరుగుతున్నందునే ఎత్తిపోతల పథకాల ద్వారా గోదావరి జలాలను విడుదల చేయలేదని వైఎస్సార్ సీపీ నాయకులు విమర్శిస్తున్నారు. నీటిని విడుదల చేస్తే ముందుగా చెరువులను నింపాలి, అదే జరిగితే మట్టి తవ్వకాలకు బ్రేకులు పడతాయి. కోట్ల రూపాయల ఆదాయానికి గండి పడుతుందనే ప్రధాన కారణంతోనే అన్నదాతలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. వెంటనే ఎత్తిపోతల పథకాల ద్వారా మెట్ట ప్రాంతానికి సాగునీరు విడుదల చేయాలని, లేకుంటే రైతుల పక్షాన వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని రాజానగరం, అనపర్తి నియోజక వర్గాల నాయకుల హెచ్చరించారు.

మట్టి దోపిడీ కోసమే..



నియోజకవర్గంలో ఏ ఒక్క రైతూ సాగు నీటి సమస్యను ఎదుర్కోకుండా సమర్థ పాలన అందించిన ఘనత గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదే. కూటమి అధికారంలోకి వచ్చాక ఇసుక, మట్టి దోపిడీలకు ప్రాధాన్యత ఇవ్వడంతోనే సాగు నీటి కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెరువులలో మట్టి తవ్వకాలకు ఆటకం కలుగుతుందనే ఒక కారణంతో ఇంతవరకు ఎత్తిపోతల పథకాల నుంచి నీటిని విడుదల చేయలేదు. ఇది చాలా దారుణం.

– అడబాల చినబాబు, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ వ్యవసాయ విభాగం

పొలం ఎండిపోయింది

సాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. చెదురుమదురుగా కురుస్తున్న వర్షాలు చాలినంత నీటిని ఇవ్వలేకపోతున్నాయి. ఇదే సమయంలో వేసవిని మరపించేలా కాస్తున్న ఎండలతో వరి చేలు, నారుమడులు ఎండిపోతున్నాయి. రెండు ఎకరాలకు నారుమడి వేశాను. సమృద్ధిగా నీరు లేక ఎండిపోయింది. ఇలాగైతే ఖరీఫ్ సాగు గట్టెక్కడం కష్టమే.

– సీహెచ్ ధనయ్య, రైతు, వడిశలేరు, రంగంపేట మండలం

తక్షణమే సాగునీరు అందించాలి

పొలాలు ఎండిపోతున్నా ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు విడుదల చేయలేదు. జూన్‌లో కురిసిన వర్షాలకు వరినాట్లు వేశాం. ఎత్తిపోతల పథకాల నుంచి గోదావరి జలాలను విడుదల చేస్తారు కదా అనుకుంటే ఇంత వరకు వాటి జాడే లేదు. నీరు లేక పంటలు ఎండిపోతుంటే పాలకులు చోద్యం చూస్తున్నారు. తక్షణమే నీరు విడుదల చేయాలి.

– నలమాటి భీముడు, రైతు, వడిశలేరు, రంగంపేట మండలం

జక్కంపూడి రాజాకు సంఘీభావం



రాజమహేంద్రవరంలో జక్కంపూడి రాజాను కలసిన వైఎస్సార్ సీపీ నాయకులు

అనపర్తి: రాజమహేంద్రవరం పేపర్ మిల్లు కార్మికుల సమస్యలపై నిరవధిక దీక్ష చేస్తూ, మంగళవారం నుంచి ఆమరణ దీక్షకు దిగుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు సంఘీభావం తెలిపారు. వారందరూ సోమవారం రాజాను కలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి, ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రంగంపేట జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కొల్లాటి ఇజ్రాయేలు, పెదపూడి మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ సాంబత్తుల చంటి, పార్టీ యువజన విభాగం అధ్యక్షులు పడాల దుర్గారెడ్డి, యువజన విభాగం నేతలు కొవ్వూరి సుబ్బారెడ్డి, కర్రి లక్ష్మీనారాయణరెడ్డి, చింతా ప్రభాకరరెడ్డి తదితరులు ఉన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు అప్రజాస్వామికం



గొల్లపల్లి ప్రవీణ్ కుమార్

కోరుకొండ: వైఎస్సార్ సీపీ ఎంపీ, పార్లమెంటరీ పార్టీ ఫ్లోర్ లీడర్ పి.మిథున్‌రెడ్డి అరెస్టు అప్రజాస్వామికమని కోరుకొండ ఎంపీటీసీ సభ్యుడు గొల్లపల్లి ప్రవీణ్ కుమార్ అన్నారు. కూటమి ప్రభుత్వ కుట్రపూరిత తీరును తీవ్రంగా ఖండించారు. లిక్కర్ అక్రమ కేసులో ఆయనను అరెస్టు చేయడాన్ని తప్పుపట్టారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. బాబాసాహెబ్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగానికి భిన్నంగా వ్యవహరించడాన్ని తప్పుపట్టారు. అబద్ధపు వాంగ్మూలాలను సృష్టించడం తప్ప ఎటువంటి ఆధారాలు లేవన్నారు. అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతున్న సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, నారా లోకేష్ వచ్చే ఎన్నికల్లో చుక్కలు చూస్తారని హెచ్చరించారు.

భూగర్భాన్నే చీల్చేస్తున్న మీరా నీతులు చెప్పేది?

- రైతు సమస్యలపైనే మా పోరాటం
- ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిపై డాక్టర్ సూర్యనారాయణరెడ్డి ఆగ్రహం



అనపర్తిలో మాట్లాడుతున్న డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: అక్రమ సంపాదన కోసం తల్లి లాంటి భూమాత గర్భాన్నే చీల్చేసి గ్రావెల్, మట్టిని తరలిస్తున్న మీరా మాకు నీతులు చెప్పేది అంటూ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిపై మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనపర్తిలోని పార్టీ కార్యాలయంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. కైకవోలులో రైతులు నీరందక ఇబ్బందులు పడుతుంటే, నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్న అధికారులు, అధికార పార్టీ నాయకుల కళ్లు తెరిపించడానికి ఎండిపోయే దశలో ఉన్న పంట పొలంలో స్కూటీపై తిరిగి సమస్య తీవ్రతను ప్రదర్శించామే తప్ప.. మీలా రాజకీయం చేయడానికి కాదన్నారు. తమ ప్రభుత్వ హయాంలో నీరు ఉన్నాగానీ కరకుదురు, పెదపూడిల్లో మీ నాయకులతో కలసి పంట పొలాల్లో మోటారు బైక్‌లపై తిరిగిన విషయం మర్చిపోయారా అని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. ఇలాగే చెరువులు తవ్వేయడంతో లోతు అంచనా వేయలేక గేదెలను మేపుకోవడానికి, బహిర్భూమికి వెళ్లి బిక్కవోలు మండలం కాపవరం గ్రామంలో నలుగురు, రంగాపురంలో ఇద్దరు, రంగంపేట మండలంలో ఇద్దరు చనిపోయిన సంగతి గుర్తుందా అని నిలదీశారు. తాను రైతు సమస్యలపై పోరాడుతుంటే దానికి సమాధానం చెప్పకుండా వ్యక్తిగతంగా విమర్శలు చేస్తున్నారన్నారు. అక్రమార్జనతో మతి చెడిన ఆయనకే కడ్డీలు అవసరమన్నారు. బావమరిదిని అడ్డుపెట్టుకుని అక్రమ వ్యవహారాలు చేస్తూ మట్టి, మద్యం, పేకాట క్లబ్‌ల ద్వారా వచ్చే అక్రమ సంపాదనను క్యాషియర్‌కు పంపిస్తున్నారని ఆరోపించారు.

చెరువుల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు



ఎర్ర చెరువులో జరుగుతున్న మట్టి తవ్వకాలు

బిక్కవోలు : రంగాపురం గ్రామంలోని పలు చెరువుల్లో రాత్రి సమయంలో విలువైన మట్టిని తరలించుకుపోతున్నారు. పగలంతా అక్కడ ఏమీ జరగడం లేదు, రాత్రి అయ్యిందంటే అధికార కూటమి పార్టీకి చెందిన ఒకరిద్దరు నాయకులు మట్టిని తవ్వి స్థానికంగానూ, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా స్థానిక రెవెన్యూ అధికారులు గానీ, పంచాయతీ అధికారులు గానీ స్పందించడం లేదు. స్థానిక ఎర్ర చెరువులో ఒకే చోట తవ్వితే పెద్ద గొయ్యి పడుతుందని, ప్రజల దృష్టి మరల్చడానికి చెరువులో అక్కడక్కడ గోతులు తీస్తు పోతున్నారు. దీని వల్ల వర్షం నీరు చేరినప్పుడు గుంతలు ఎక్కడ ఉన్నాయో తెలియక చెరువులో దిగిన పశువులు, మనుషులు మునిగిపోయి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

పాలిటెక్నిక్‌తో ఉద్యోగావకాశాలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొ వీసీ డాక్టర్ కేవీబీ రాజు

రాజానగరం: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇంజినీరింగ్‌తో పాటు పాలిటెక్నిక్ విద్యార్థులకూ అనేక ఉద్యోగావకాశాలు ఉన్నాయని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) ప్రొ వీసీ డాక్టర్ కేవీబీ రాజు అన్నారు. యూనివర్సిటీ ప్రాంగణంలోని గైట్ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం జరిగిన పేరెంట్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేసిన తర్వాత ఆసక్తిని బట్టి ఉన్నత చదువులు, ఉద్యోగాలకు అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పీజీ రామానుజం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



వీపీఏల శిక్షణలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ వెంకట నరసింహారావు

కోరుకొండ: ఖరీఫ్ సీజన్‌లో వరిలో నాణ్యమైన అధిక దిగుబడులు పొందాలంటే రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. కోరుకొండ మండలం కాపవరం ఎంపీడీఓ కార్యాలయంలో రైతుసేవాకేంద్రం సిబ్బందికి శిక్షణ కార్యక్రమం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నరసింహారావు మాట్లాడుతూ వర్షాభావం కారణంగా రాజానగరం నియోజకవర్గంలో వరి నాట్లు ఆలస్యమయ్యాయన్నారు. రైతులు పచ్చిరొట్ట ఎరువులు, విత్తన శుద్ధి, ఎరువుల యాజమాన్యం చీడపీడలు, ఎలుకల నివారణ, పంట మార్పిడి తదితర మెళకువలను అనుసరిస్తే నాణ్యమైన అధిక దిగుబడిని సాధించవచ్చన్నారు. వ్యవసాయశాఖ ఏడీ టీకే మల్లికార్జునరావు మాట్లాడుతూ ఎండాకు తెగులు, సుడిదోమ, కాండం తొలిచే పురుగు తెగుళ్ల నివారణకు నత్రజని, పొటాష్ ఎరువులను వినియోగించాలన్నారు. సమావేశంలో శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి రాజశ్రీ, ఆత్మ బీటీఎం రాజశేఖర్ పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి



మహిళ సమస్య వింటున్న కలెక్టర్ ప్రశాంతి

బిక్కవోలు: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి పీజీఆర్ఎస్ ఉపయోగపడుతుందని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. బిక్కవోలు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, ఇతర అధికారులతో కలసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా, డివిజన్, మండల స్థాయిలో నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్‌ను ప్రజలు సద్వినియోగపరచుకోవాలన్నారు. బిక్కవోలులో వివిధ సమస్యలపై 20 అర్జీలు వచ్చాయన్నారు. ప్రజలు సమస్యలను వివరించేందుకు వ్యయ ప్రయాసలు పడి కలెక్టరేట్‌కు రావాల్సిన అవసరం లేదన్నారు. డివిజన్, మండల స్థాయిలో జరిగే కార్యక్రమాల్లో అధికారులకు అర్జీలు అందజేయవచ్చన్నారు. అలాగే 1100 మీ కోసం కాల్ సెంటర్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. కోళ్ల ఫారంతో ఇబ్బందులు, పింఛన్, 1బీ మార్పు, పొలం కబ్జా, రీసర్వే, పొలం ఆక్రమణ, తల్లికి వందనం పడలేదని పలువురు అర్జీలు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బీఎస్‌వీవీ కృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇద్దరు రైల్వే ఉద్యోగులకు జీఎం సేఫ్టీ అవార్డులు



అవార్డులు అందుకుంటున్న విజయవాడ డివిజన్ ఉద్యోగులు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): రైళ్ల నిర్వహణలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, అప్రమత్తంగా విధులు నిర్వర్తించిన విజయవాడ డివిజన్‌కు చెందిన ఇద్దరు ఉద్యోగులు దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ చేతుల మీదుగా 'జీఎం మ్యాన్ ఆఫ్ ద మంత్ సేఫ్టీ' అవార్డులు అందుకున్నారు. జోనల్ హెడ్ క్వార్టర్స్ సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం నుంచి సోమవారం విజయవాడ డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్‌తో పాటుగా సికింద్రాబాద్, హైదరాబాద్, గుంటూరు, గుంతకల్లు, నాందేడ్ డివిజన్ల డీఆర్ఎంలతో వర్చువల్ పద్ధతిలో భద్రతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రయాణికుల సురక్షిత ప్రయాణం, భద్రతలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్రమం తప్పకుండా అన్ని సెక్షన్‌లలో సేఫ్టీ డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం విజయవాడ డివిజన్‌లో విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించిన సామర్లకోటలోని టీటీఐ డీవీకేఎస్‌పీ చైతన్య, రాజమహేంద్రవరంలోని ట్రైన్ మేనేజర్ కె.పాపారావుకు అవార్డులు అందజేసి అభినందించారు.

చోరీ కేసులో ఎనిమిది మంది అరెస్టు



బిక్కవోలులో మాట్లాడుతున్న డీఎస్పీ విద్య

బిక్కవోలు: కండక్టర్‌పై దాడి చేసి నగదు, సెల్‌ఫోన్ లాక్కుని పారిపోయిన కేసులో ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు రాజమహేంద్రవరం ఈస్ట్ జోన్ డీఎస్పీ బి.విద్య తెలిపారు. ఆమె సోమవారం మాట్లాడుతూ మండలంలోని బలభద్రపురంలోని ఫ్లైఓవర్‌పై ఈనెల 18వ తేదీన కండక్టర్ కరుపోతు వరప్రసాద్‌పై ఎనిమిది మంది దాడి చేశారు. అతడి నుంచి రూ.1,550, సెల్‌ఫోన్ లాక్కుని పరారయ్యారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఎనిమిది మంది నిందితులను గుర్తించారు. వీరిలో ఊలపల్లికి చెందిన బదిరెడ్డి శ్రీసాయి అనుసందీప్, ఖండపల్లి సాయి, రాయవరం మండలం వెదురుపాక సావరానికి చెందిన మేడిశెట్టి కుమార్, రాయవరం గ్రామానికి చెందిన కురుపూడి అభిలాష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అలాగే తొస్సిపూడి, పందలపాక, వెదురుపాక సావరం, జి.మామిడాడ చెందిన మరరో నలుగురు ఈ కేసులోఉన్నారన్నారు. అతి తక్కువ సమయంలోనే నేరస్తులను పట్టుకున్న సీఐ వీఎల్‌వీఎస్ సుమంత్, ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్, పోలీసులు సిబ్బంది అభినందించారు.

బ్రిడ్జికౌంటీలో కనీస సౌకర్యాలు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ సభ్యులు

సీటీఆర్ఐ: గైట్ కాలేజీ సమీపంలో మినీ అమెరికా పేరుతో నిర్మించిన టౌన్ షిప్‌లో హామీ ఇచ్చిన మేరకు సౌకర్యాలను వెంటనే కల్పించాలని బ్రిడ్జికౌంటీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. దశాబ్ద కాలమైనా, కనీస సౌకర్యాలు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేసింది. స్థానిక గణేష్ చౌక్ లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు సీఎస్ మహాదేవ్, సెక్రటరీ సీహెచ్ ఏసుదాసు, ట్రెజరర్ రామకృష్ణ, శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2010లోనే ఇక్కడ విల్లాలు, అపార్టుమెంట్లు నిర్మించి, అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఒప్పందం ప్రకారం రెండేళ్లలోనే నిర్మాణాలు పూర్తి చేసి, సౌకర్యాలు కల్పించి అప్పగించాల్సి ఉందన్నారు. ఐదేళ్లు దాటిపోయినా పూర్తి చేయకపోవడంతో బిల్డర్‌తో పోరాటం చేసి, చివరకు ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేశామన్నారు. తమకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

జీవన ఎరువుల వాడకంతో ప్రయోజనాలు



సేంద్రియ ఎరువులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

బిక్కవోలు: పచ్చిరొట్ట, జీవన ఎరువుల వాడకంతో వ్యవసాయ భూముల ఉత్పాదకతను పెంచుతూ, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవచ్చని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ఆమె సోమవారం బిక్కవోలు మండల పరిషత్ కార్యాలయం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఉత్పత్తులను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పచ్చిరొట్టలు మట్టిలో జీవక్రియను ప్రోత్సహించి, నేల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించడమే కాకుండా నీటి నిల్వ సామర్థ్యాన్ని మెరుగుపరుస్తాయన్నారు. దీనివల్ల రసాయన ఎరువుల వినియోగం సుమారు 25 శాతం తగ్గుతుందన్నారు. జీవన ఎరువుల వాడకంతో కనీసం 10 శాతం వరకు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించవచ్చన్నారు. వ్యవసాయశాఖ అధికారులు మాట్లాడుతూ నత్రజని స్థిరపరచే సూక్ష్మజీవులైన రైజోబియం, అజోటోబాక్టర్, అజోస్పిరిల్లం భూమిలో నత్రజనిని నిలుపుతూ, పంటల పెరుగుదలకు తోడ్పడతాయని కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలోని జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.మాధవరావు, మండల వ్యవసాయశాఖ అధికారి శామ్యూల్ జాన్, ఎంపీపీ తేతలి సుమ, బిక్కవోలు సర్పంచ్ సరెళ్ల సుమలత పాల్గొన్నారు.